

నగరాభివృద్ధిశాఖ కార్యదర్శికి ఈడీ నోటీసులు

బెంగళూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'ముడా' ఇంటి స్థలాల అవినీతి కేసు విధానసౌధ దాకా చేరింది. విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు నగరాభివృద్ధిశాఖ మంత్రిత్వ కార్యాలయానికి చేరినట్టయ్యింది. శాఖ కార్యదర్శికి సోమవారం నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఉదయం 11 గంటలకు విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. సమగ్ర రికార్డులతో రావాలని సూచించారు. 'ముడా' సంస్థ నగరాభివృద్ధిశాఖ పరిధిలోకి వస్తున్నందున శాఖ కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు.





నగరంలో ట్రాఫిక్ జామ్..

బళ్లారిలో జోరుగా కురుస్తున్న వర్షం



నగరంలోని జగ్జీవన్‌రామ్‌నగర్‌లో కూలిన ఇంటిగోడ

రాష్ట్రమంతటా

ఫెంగల్ బీభత్సం

- తీరప్రాంత, మలెనాడు జిల్లాల్లో ప్రభావం
- చేపలవేటకు వెళ్లరాదని అధికారుల హెచ్చరిక
- బెంగళూరులోనూ దంచి కొట్టిన వర్షం
- పలు జిల్లాల్లో పాఠశాలలకు సెలవు

బెంగళూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఫెంగల్ తుఫాను ప్రభావం తీవ్రస్థాయికి చేరింది. రాష్ట్రమంతటా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. ప్రధానంగా తీరప్రాంత జిల్లాలు ఉత్తర కన్నడ, దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రెండు రోజులు విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. పశ్చిమ కనుమలకు అనుబంధమైన మలెనాడు శివమొగ్గ, చిక్కమగళూరు, కొడగు జిల్లాల్లోనూ విస్తారంగా వానలు కురుస్తున్నాయి. మైసూరు, మండ్య, రామనగర, కోలారు, చిక్కబళ్లాపుర జిల్లాల్లో భారీ వర్షం కారణంగా సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. ఉత్తర కర్ణాటక ప్రాంతాల్లోనూ వర్షం అలజడి సృష్టిస్తోంది. బెంగళూరులో ఆదివారం రాత్రి ప్రారంభమైన వర్షం సోమవారం రోజంతా కొనసాగింది. నగర ప్రజలు సంచరించేందుకు ఇబ్బంది పడ్డారు. వారాంతం ముగిసి ఆఫీసులు, ఐటీబీటీ కంపెనీలకు వెళ్లేందుకు ఉద్యోగులు తంటాలు పడ్డారు. కొన్ని కంపెనీల ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోంతో సరిపెట్టుకున్నారు. వాతావరణ పరిశోధనశాఖ అభిప్రాయం మేరకు మంగళవారం కూడా ఇదే తరహాలో వర్షం ప్రభావం ఉంటుందని తెలిపారు. బెంగళూరు, ఉడుపి, చిక్కమగళూరు, చిక్కబళ్లాపుర జిల్లాల్లో మరింత ఎక్కువ వర్షం కురిసే అవకాశం ఉందని ప్రకటించారు. మొత్తంగా రాష్ట్రమంతటా వర్షం ప్రభావం కొనసాగింది. కాగా వరుస వర్షం ప్రభావం కారణంగా పాత మట్టి భవనాల గోడలు దెబ్బతిని కూలాయి. బీబీఎంపీ పరిధిలో పలు చోట్ల చెట్లు, చెట్ల కొమ్మలు కూలడంతో ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంది. ప్రత్యేక బలగాలు రంగంలోకి దిగి కార్యాచరణ నియంత్రణా చర్యలు కొనసాగించాయి. చామరాజపేట నియోజకవర్గంలో ఓ ఇల్లు కూలింది. ఇంట్లో ఉన్న వృద్ధ దంపతులను స్థానికులు హుటాహుటిన రక్షించారు. కాగా సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు. గంటకు 35-55 కిలోమీటర్ల వేగంతో గాలి వీస్తుందని వాతావరణ పరిశోధనశాఖ ప్రకటించింది.



వర్షంలో నగరవాసులు ఇలా..

నోటీసులకు భయపడం

- అగ్రనేతలతో చర్చిస్తాం: యత్నాళ్
- విజయేంద్ర సమర్థుడు కాదు: రమేశ్ జార్కిహొళి

బెంగళూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పంపిన నోటీసులకు భయపడేది లేదని అగ్రనేతలతో చర్చిస్తామని రెబల్ కూటమిలోని ముఖ్యనేత బసనగౌడ పాటిల్ యత్నాళ్ మండిపడ్డారు. రెబెల్ కూటమిలోని సభ్యులు రోజుకో ఆరోపణ చేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, పార్టీ సీనియర్‌నేత యడియూరప్పను టార్గెట్ చేస్తూ విమర్శలు చేస్తున్నారు. మాజీ మంత్రి అరవింద లింబావళి ఇటీవల మీడియాతో మాట్లాడుతూ సీఎం, డీసీఎంలతో పార్టీ అధ్యక్షుడు ఒప్పందం చేసుకున్నారని ఆరోపించిన సంగతి తెలిసిందే. తాజాగా మాజీ మంత్రి రమేశ్ జార్కిహొళి బెళగావిలో మీడియాతో మాట్లాడుతూ యత్నాళ్‌కు రెండు మూడురోజులకిందటే నోటీసు వచ్చిందని దానికి భయపడేది లేదన్నారు. యడియూరప్ప పోరాట పటిమ కల్గినవారని, కానీ విజయేంద్రకు అనుభవం లేదన్నారు. సమర్థవంతుడికి అధ్యక్ష పదవి కేటాయించాలన్నారు. యడియూరప్పతో ప్రస్తుతం లింగాయతులు, ఒక్కలిగలు ఎవరూ మద్దతుగా లేరన్నారు. విజయేంద్రతో ఉండేవారంతా బీసీ వర్గాలన్నారు. మాజీ మంత్రి రేణుకాచార్య రాజకీయ అస్థిత్వం కోసం ఆరోపణలు చేస్తున్నారన్నారు. అగ్రనేతలను కలిసేది లేదని, వక్ఫ్‌బోర్డుకు తీరుకు వ్యతిరేకంగా జాయింట్ పార్లమెంటరీ కమిటీకి రాష్ట్రంలో పరిస్థితిని వివరించి నివేదిక ఇస్తామన్నారు.

జైలు సూపరింటెండెంట్‌కు బెదిరింపులు..

ఖైదీలు, ఇద్దరు మహిళలపై కేసు

బెంగళూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కలబురగి సెంట్రల్ జైలులో ఆహారం నాసిరకం అని, కనీస సౌలభ్యాలు లేవని ఇటీవల ఖైదీలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత జైలు సూపరింటెండెంట్ కారును పేల్చేస్తామని హెచ్చరిస్తూ ఓ ఆడియో సందేశాన్ని పోలీసులకు పంపారు. 9మంది విచారణ ఖైదీలతోపాటు వారి బంధువులైన ఇద్దరు మహిళలు కలిపి 11మందిపై కేసు నమోదు చేశారు. కలబురగి ఫర్హతాబాద్ ఇన్‌స్పెక్టర్ ఎన్ మల్లికార్జున సోమవారం మీడియాకు తెలిపారు. నవంబరు 28న మొబైల్‌కు ఓ అజ్ఞాత సందేశం వచ్చిందని దీని ప్రకారం కలబురగి జైలు సూపరింటెండెంట్ అనితా కారును పేల్చివేస్తామనే బెదరింపులకు పాల్పడ్డారన్నారు. దీంతో బీఎన్ఎస్ సెక్షన్ 132 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి విధులకు భంగం కలిగించారని, సెక్షన్ 190 ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. కేసులో 9మంది అండర్ ట్రయల్ ఖైదీలు కాగా ఇద్దరు మహిళలు, వారి కుటుంబ సభ్యులన్నారు. ఇటీవల జైలులో నిబంధనలు కఠినం చేయడంతో బెదిరింపులకు పాల్పడ్డారు.

ఏకాగ్రతతోనే గ్రూప్స్‌లో విజయం సాధ్యం
● యూపీఎస్సీ మాజీ చైర్మన్ డీపీ అగర్వాల్
ప్రైవేట్ బస్సుల మధ్యపోటీ
● ప్రయాణికులకు గాయాలు
బాలల్లో సాహిత్యాభిలాష పెరగాలి
● జాతీయ పురస్కార గ్రహీత నాగవేణి
7లో

రాష్ట్రాల అభివృద్ధితోనే దేశ ప్రగతి

- తుమకూరులో ఇంటర్నేషనల్ స్టేడియం
- రూ.750 కోట్ల పనులకు సీఎం శంకుస్థాపన



జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం సిద్దరామయ్య



సీఎం బ్యాటింగ్..

బెంగళూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని సీఎం సిద్దరామయ్య అభిప్రాయపడ్డారు. తుమకూరులో 750 కోట్ల రూపాయలతో వివిధ పథకాలకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఎస్సీ, ఎస్టీ సహా పలు పథకాల లబ్ధిదారులకు వాహనాలు, ఇంటి పట్టాలు ప్రదానం చేశారు. బ్యాటింగ్ చేసి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంకు భూమిపూజ చేశారు. అనంతరం జరిగిన సభకు హోం మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పరమేశ్వర్ అధ్యక్షత వహించగా డీసీఎం డీకే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జీడీపీలో కర్ణాటక నెంబరువన్‌గా ఉందన్నారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ, కేంద్రానికి పన్నుల చెల్లింపులో కర్ణాటక రెండోస్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఆర్థికంగా, సామాజికంగా శక్తిని నింపాలనే గ్యారెంటీలు అమలు చేస్తున్నామన్నారు. హోం మంత్రి పరమేశ్వర్ మాట్లాడుతూ రెండో అంతర్జాతీయ విమానాశ్రయం తుమకూరులోనే ఏర్పాటు చేయాలని సీఎం, డీసీఎంలను వేదికపైనుంచే విన్నవించారు. జపాన్ టౌన్‌షిప్ నిర్మాణానికి 500 ఎకరాలు కేటాయిస్తామన్నారు. తుమకూరు అభివృద్ధి చెందుతున్న నగరమని కొనియాడారు. మంత్రులు రాజణ్ణ, భైరతి సురేశ్, ఢిల్లీలో కర్ణాటక ప్రతినిధి టీబీ జయచంద్ర సహా ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తి రైల్వే స్టేషన్

ప్రతిపాదనలే లేవు..!

- చిక్కబళ్లాపుర, పుట్టపర్తి రైలు మార్గానికి మొండిచేయి
- అలాంటి ప్రస్తావనే లేదన్న రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్
- రెండు దశాబ్దాలుగా తప్పని ఎదురుచూపు

బెంగళూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): చిక్కబళ్లాపుర - సత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తి రైలు మార్గానికి మరోసారి మొండిచేయి మిగిలింది. చిక్కబళ్లాపుర నుంచి బాగేపల్లి, గోరంట్ల మీదుగా పుట్టపర్తి దాకా రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ రెండు దశాబ్దాలుగా కొనసాగుతోంది. 15ఏళ్ల క్రితమే సర్వే కూడా పూర్తి చేశారు. అయితే పలు కారణాలతో వాయిదాలు పడ్డాయి. తాజాగా లోక్‌సభలో రైల్వే మార్గం ఏర్పాటుపై కేంద్రరైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ స్పందించారు. చిక్కబళ్లాపుర - పుట్టపర్తి మధ్య రైల్వేమార్గం నిర్మించే ప్రస్తావనపై తమ వద్ద ఎలాంటి ప్రతిపాదనలు లేవని స్పష్టం చేశారు. చిక్కబళ్లాపుర - సత్యసాయి ప్రశాంతి నిలయం (పుట్టపర్తి) మధ్య 103 కిలోమీటర్ల దూరం ఉందని రైల్వే ట్రాక్ ఏర్పాటుకు సర్వే జరిగిందన్నారు. అయితే జనసంచారం అంతగా అనుకూలం లేదనే కారణంతోనే ప్రస్తుతానికి ప్రాజెక్టును నిర్మించే ఆలోచననే లేదన్నారు. కానీ చిక్కబళ్లాపుర - గౌరిబిదనూరుల మధ్య 44 కిలోమీటర్ల దూరం ఉందని ఈ రైల్వేట్రాక్ ఏర్పాటుకు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్ట్ (డీపీఆర్)కు అనుమతులు ఇచ్చామన్నారు. నిర్మాణం అంచనాలు, పర్యావరణంపై ప్రభావం కోణంలో పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కర్ణాటక రైల్వే ప్రాజెక్టులు ప్రగతి పరంగా ఉన్నాయని, 2021-24ల మధ్య 56 ప్రాజెక్టులకు అంగీకారం ఇచ్చామని, వీటిలో 19 కొత్త మార్గాలు కాగా 37 డబుల్ ట్రాక్ ఏర్పాటు చేసేవిగా ఉన్నాయని అన్నారు.



కాగా పుట్టపర్తి - చిక్కబళ్లాపురల మీదుగా బెంగళూరులకు రైల్వే ట్రాక్ ఏర్పాటు చేయాలనే డిమాండ్‌లు ఉన్నాయి. గతంలో సత్యసాయి బాబా ఉన్నప్పుడే ఈ ప్రతిపాదనలు ప్రచారం సాగాయి. గతంలో పెనుగొండ నుంచి నేరుగా ధర్మవరం వెళ్లే ట్రాక్ మాత్రమే ఉండేది. ఆ తర్వాత పెనుగొండ నుంచి పుట్టపర్తి, ధర్మవరం మరో మార్గం ఏర్పాటైంది. ఈ మార్గంలో కొన్ని రైళ్లు మాత్రమే సంచరిస్తున్నాయి. వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు రైల్వే మార్గాల ఏర్పాటు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అక్కడ పాలకుల డిమాండ్‌గా ఉంది. పుట్టపర్తి - చిక్కబళ్లాపురల మధ్య రైల్వేమార్గం ఏర్పాటైతే ఏడో నెంబరు జాతీయ రహదారికి అనుబంధంగా ట్రాక్ రానుంది. చిక్కబళ్లాపుర సమీపంలోనే దేవనహళ్ళి అంతర్జాతీయ విమానాశ్రయం ఉండడం వల్ల భవిష్యత్తులో విమాన సర్వీసులు వినియోగించుకునేవారికి అనుకూలం కానుందని భావించారు. కానీ కేంద్ర రైల్వేశాఖ అటువంటి ప్రతిపాదనలు లేదని తేల్చడంతో ఇటు చిక్కబళ్లాపుర జిల్లా అటు సత్యసాయి జిల్లా ప్రజలకు నిరాశ కలిగింది.

రింగర్ ఫ్లూయిడ్ స్టాక్‌పై వైద్యుల్లో ఆందోళన

- రద్దు చేసినా తిరిగి వాడకం ఎందుకు..?
- 84వ బ్యాచ్‌లో నాణ్యతా లోపాల గుర్తింపు

బళ్లారి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణుల మృతికి వారికి అందించిన ఫ్లూయిడ్సే కారణమని తేలడం వైద్యశాఖలో కలకలం రేపుతోంది. కాన్పు సమయంలో వారి ఆరోగ్యపరిస్థితి ఆందోళనకరంగా మారడం, బీపీ పెరగడం, తదితర కారణాలతో వారు మృతి చెందారు. ఇది నవంబరు నెల 11 నుంచి 15 వరకూ జిల్లాసుపత్రిలో నాలుగు రోజుల్లోనే నలుగురు మృతి చెందారు. నలుగురు బాలింతలు మృతి చెందారు. మిగిలిన బాలింతలకు విమ్స్‌లో ఖరీదైన వైద్యం అందించారు. మృత్యువాత తప్పింది కానీ ఆరోగ్యం ఇంకా కుదుటపడలేదని తెలుస్తోంది. ఈవిషయం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ప్రభుత్వం కూడా రంగంలోకి దిగి ఘటనపై ఆరా తీసింది. బాలింతల చావుకు డాక్టర్ల నిర్లక్ష్యమా..? మందులు కారణమా? అనే కోణంలో విచారణ కూడా చేసింది.

ఫ్లూయిడ్సే కారణం

లవణగుణాలు ఎక్కువగా ఉండే ఫ్లూయిడ్స్‌ను కాన్పు సమయంలో బాలింతలకు అందజేస్తారు. ఈ ద్రవం నాణ్యత లేదని కర్ణాటక రాష్ట్ర మెడికల్ కంపెనీ లిమిటెడ్(కేఎస్ఎంఎస్ఎల్)నిర్ధారించింది. ఈ ద్రవం పశ్చిమ బెంగ ఫార్మస్యూటికల్ కంపెనీ సరఫరా చేసింది. ఈ కంపెనీ బ్యాచ్ నెంబర్ 192 కింద స్టేట్‌కు ఆర్డర్ తీసుకుని అందజేసింది. ఒక బ్యాచ్ అంటే సుమారు లక్షల కొద్దీ ఫ్లూయిడ్ బాటిళ్లు ఉంటాయి. మొత్తం 192 బ్యాచ్‌లో 82వ బ్యాచ్ ఫ్లూయిడ్స్‌లో నాణ్యత కొరవడిందని పరీక్షల్లో తేలింది. అయితే కొద్ది రోజుల తరువాత కేంద్ర డ్రగ్స్ కంట్రోల్ నిపుణులు దీన్ని వల్ల ఏమీ నష్టం లేదు అని నిర్ధారించి వాడేందుకు సంకేతం ఇచ్చారు. అయితే అవే ఫ్లూయిడ్స్ వాడడంతోనే సమస్య ఏర్పడిందని డ్రగ్స్ ఆఫీసర్లు తేల్చారు.

ఈ కంపెనీ ఫ్లూయిడ్స్ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా అయ్యాయి. అయితే బాలింతల మృతికి ఫ్లూయిడ్సే కారణమని తేలడంతో ఇంకా ఎక్కడ స్టాక్ ఉంది, ఏ జిల్లాల్లో ఏ బ్యాచ్ ఉంది తదితర వివరాలను సేకరిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వాడకాన్ని నిలిపివేయాలని వైద్యులను వైద్యశాఖ ఆదేశించింది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నివేదిక ఆధారంగా స్టేట్ డ్రగ్స్ ఆఫీసర్ ను సస్పెండ్ చేసింది. సీఎం సిద్దరామయ్య కూడా శనివారం బెంగళూరులో వైద్యులతో ఘటనపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించిన ఐవీ రింగర్ ల్యాక్‌టెట్ ఫ్లూయిడ్ ను కేంద్ర డ్రగ్స్ టీం వాడడంపై సిద్దరామయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం బాలింతల మృతికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడు, ఆర్ ఆశోక్ ఆదివారం బళ్లారిలో ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యటించి వైద్యులతో మాట్లాడారు. ఘటనకు మందులు కారణమా లేక వైద్యులా అన్నది ఆరా తీశారు. మరణించిన బాలింతల కుటుంబాలకు రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న వారికి కూడా పరిహారం చెల్లించాలన్నారు. స్వపక్షం, విపక్షం ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ రాజకీయ లబ్ధి కాకుండా బాధితులకు న్యాయం చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రంలో డ్రగ్స్ మాఫియా చెలరేగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఆసుపత్రిలో ఫ్లూయిడ్స్‌ను పరిశీలిస్తున్న ప్రతిపక్ష నాయకుడు ఆశోక్

న్యూస్ బాక్స్

9న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ పరిధిలో అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 9న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఎన్‌సీవీటితోపాటు కులధ్రువీకరణ పత్రం, వికలాంగులైతే అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్కు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు 2, ఆధార్ కార్డు జిరాక్స్‌కాపీలతోపాటు రూ.118లు వెరిఫికేషన్ ఫీజుతో కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలకు చేరుకోవాలన్నారు. డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులకు ఈనెల 9న ఉదయం 9 నుంచి మ ధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే మోటా ర్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటింగ్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ పనులకు సంబంధించి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. వివరాలకు 08518 257025 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత శిక్షణకు జిల్లాలోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో టెట్ అర్హత సాధించిన బీసీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కింద ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. టెట్‌లో అర్హతలో సాధించిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు టెట్ మార్కుల జాబితా, టీసీ, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కలెక్టరేట్ దగ్గర ఉన్న బీసీ స్టడీ సర్కిల్లో దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు ఉండాలన్నారు. వివరాలకు సెల్ : 7799043773 సంప్రదించాలన్నారు.

క్రీడాభారతి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శాప్ అనుబంధంగా ఉన్న చైతన్యకశ్యప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసే క్రీడాభారతి అవార్డులకు అర్హులైన క్రీడాకారులు ఈనెల 4లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ తెలిపారు. 12 సంవత్సరాలుపైబడిన క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విజేతలను ఎంపిక చేయడానికి ఈనెల 8న క్రీడా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష 25 నిముషాల పాటు ఉంటుందని, 50 ప్రశ్నలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్ క్రీడా పరీక్షలో ఉత్తీర్ణులైన విజేతలకు మొదటి బహుమతిగా రూ.1లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన ఇద్దరికి చెరో రూ.50వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున, నాలుగో అవార్డు రూ.11వేలు 11మందికి అందజేస్తారన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849421462ను సంప్రదించాలని కోరారు. దరఖాస్తులను http://kreedaabharati.org/. వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయాలన్నారు.

ఆయుష్ పేరుతో.. అక్రమాలు..!

- ఆయుష్ వైద్యం ముసుగులో 'వ్యాపారం'
- అనుమతిలేకుండానే ఆస్పత్రులు, షాపులు నిర్వహణ
- విజిలెన్స్ తనిఖీల్లో బట్టబయలైన అక్రమాలు
- ఇటీవల అనంతలో నాలుగు ఆస్పత్రులు, మందుల షాపుల సీజ్



సాయినగర్‌లోని ధన్వంతరి ఆయుష్ మెడికల్‌షాపు

కొందరు ఆయుష్ డాక్టర్లు అక్రమదందాకు తెరలేపారు. ఆయుష్ మందులు మంచిగా పని చేస్తాయని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవనే ప్రచారం ఎక్కువగా ఉంది. దీంతో వివిధ రోగాలతో బాధపడేవారు ఈ మందుల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే కొందరు ఆయుష్ వైద్యులు సొంతంగా ఆస్పత్రులు, మందులషాపులు ఏర్పాటు చేసుకొని 'వ్యాపారానికి' తెర తీశారు. అనుమతులు లేని ఆయుష్ మందులు అమ్ముతూ ప్రజలప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఈ అక్రమ ఆయుష్ ఆస్పత్రులు, మందులషాపుల విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్ర ఆరోగ్యశాఖ కమిషనర్ ఈ ఆయుష్ షాపులను పరిశీలించి వాస్తవ నివేదికలు ఇవ్వాలని విజిలెన్స్‌శాఖను ఆదేశించారు.

- అనంతపురంటౌన్ (ఆంధ్రజ్యోతి)

● ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ల నిర్వహణ

విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన నాలుగు ఆస్పత్రుల్లో మూడు ప్రభుత్వ ఆయుష్ డాక్టర్లే నిర్వహిస్తుండటం గమనార్హం. వీరు ప్రభుత్వ ఆయుష్ ఆస్పత్రులలో ఇతర డాక్టర్ల మాదిరి గానే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అయితే వీరి పర్యవేక్షణ వైద్యశాఖకు సంబంధం లేదంటున్నారు. డ్రగ్స్‌శాఖకు సంబంధం లేదంటున్నారు. రాయలసీమ స్థాయిలో కర్నూలులో వీరికి సంబంధించి ఇద్దరు పర్యవేక్షణ అధికారులు ఉంటారని చెబుతున్నారు. దీంతో వీరి గురించి ఎవరూ పట్టించుకోరు కాబట్టి సక్రమంగా డ్యూటీలకు వెళ్లడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ధైర్యంగా జిల్లాకేంద్రంలో ఆయుష్ ఆస్పత్రులను పెట్టుకొని, సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

● జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఆయుష్ ఆస్పత్రులు, మందుల దుకాణాలు ప్రారంభించాలంటే తొలుత రాష్ట్రస్థాయిలో ఉన్న ఆయుష్ కమిషనర్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయి పరిశీలనకు పర్యవేక్షణ అధికారులను పంపుతారు. అన్నీ సక్రమంగా ఉంటే రాష్ట్ర ఆయుష్‌శాఖ కమిషనర్ నుంచి హాస్పిటల్, మందులషాపు నిర్వహణకు అనుమతులు మంజూరు అవుతాయి. ఇవన్నీ ఏమిలేకుండానే జిల్లాలో ఆయుష్ ఆస్పత్రులు, మందుల షాపులు నిర్వహిస్తున్నారు. అనంతపురంలోనే కాదు కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి ప్రాంతాలలో కూడా అనుమతులు లేకుండా ఆయుష్ ఆస్పత్రులు, మందుల షాపులు నిర్వహిస్తున్నారు. కాగా ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఇటీవల కొందరు సొంతంగా మందులు తయారుచేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఆమందులను కూడా తక్కువ ధరకే కొనుగోలు చేసి ఈఆయుష్ ఆస్పత్రుల డాక్టర్లు, మందులషాపు యజమానులు అమ్ముతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకే దాడులు

రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకే జిల్లాలో ఆయుష్ ఆస్పత్రులు, మందులషాపుల్లో తనిఖీలు నిర్వహించాం. జిల్లాకేంద్రంలో ఆరు ఆస్పత్రులు, మందుల షాపులు తనిఖీలు చేశాం. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించాం. దీంతో ఆయా ఆస్పత్రులు, మందుల షాపులను సీజ్ చేశాం. ప్రభుత్వానికి నివేదికలు పంపాం

- నాగభూషణం, డీఎస్పీ, విజిలెన్స్

అనుమతులు మా పరిధిలో ఉండవు

ఆయుష్ మందులషాపులకు అనుమతులు ఇవ్వడం మా పరిధిలో ఉండదు. ఆయుష్ ఆస్పత్రులు, మందుల షాపుల నిర్వహణకు రాష్ట్ర ఆయుష్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ అనుమతులు ఇచ్చిన తర్వాతనే ఇక్కడ ఆస్పత్రులు, మందులషాపులు ఏర్పాటు చేసుకొని నిర్వహించాలి. విజిలెన్స్ అధికారులతో పాటు నేనూ కూడా తనిఖీలకు వెళ్లిన సమయంలో అనుమతులు లేకుండానే ఆయుష్ మందుల షాపులు నిర్వహిస్తున్నట్లు బయటపడింది. దీంతో సీజ్ చేశాం.

- రమేష్‌రెడ్డి, డ్రగ్స్‌శాఖ అడిషనల్ డైరెక్టరు



నాలుగు ఆస్పత్రులు, మందుల షాపులు సీజ్


ఆయుష్ మందులను పరిశీలిస్తున్న విజిలెన్స్, డ్రగ్స్‌శాఖ అధికారులు

రాష్ట్రవ్యాప్తంగా గతనెల 25న అన్నిజిల్లాలో ఆయుష్ ఆస్పత్రులు, మందులషాపులపై దాడులు జరిగాయి. ఈక్రమంలోనే అనంత జిల్లాలో విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టరు రమేష్‌రెడ్డి బృందం తనిఖీలు నిర్వహించింది. జిల్లాకేంద్రంలోని ఆరు ఆయుష్ ఆస్పత్రులతోపాటు అక్కడే నిర్వహిస్తున్న ఆయుష్ మందుల షాపులను తనిఖీ చేశారు. ఇందులో నాలుగు ఆస్పత్రులు, మందుల షాపులు ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు బయటపడింది. జిల్లా కేంద్రంలోని కమలానగర్‌లో ఉన్న మెహతాఆయుర్వేద హాస్పిటల్, రామచంద్రనగర్‌లోని సుశ్రుత ఆయుర్వేద హాస్పిటల్, అరవిందనగర్‌లోని కేరళ అమూల్యా ఆయుష్ హాస్పిటల్, సాయినగర్‌లోని ధన్వంతరి ఆయుష్ హాస్పిటల్‌తోపాటు అక్కడే నిర్వహిస్తున్న ఆయుష్ మందుల షాపులను విజిలెన్స్‌శాఖ అధికారులు సీజ్ చేశారు.

పారిశ్రామికాభివృద్ధికి చొరవ చూపండి

- ఏపీఐఐసీ ఎండీ, పరిశ్రమల శాఖ కమిషనర్ అభిషిక్త్ కిషోర్

అనంతపురం అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని ఏపీఐఐసీ ఎండీ, పరిశ్రమల శాఖ కమిషనర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. అనంత ఉమ్మడి జిల్లాలో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ఏపీఐఐసీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోనీ, అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ తర్వాత జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో పలు అంశాలపై ఆరా తీశారు. ఉమ్మడి జిల్లాలో ఏఏ రకాల పరిశ్రమలు స్థాపించారు..? ఇంకా ఏఏ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ఆసక్తి చూపుతున్నారన్న అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశ్రామికవాడలను మరింత అభివృద్ధి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ వివరాలను క్షేత్రస్థాయిలో ఔత్సాహికులకు తెలియజేసి, పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోనీ, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, ఏడీ రాజశేఖర్‌రెడ్డి, ఐపీఓలు రవీంద్రనాథ్‌రెడ్డి, భువనేశ్వరి, నిషాంత్ తదితరులు పాల్గొన్నారు.


పరిశ్రమల శాఖ జిల్లా కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అభిషిక్త్ కిషోర్


ఎంపికైన విద్యార్థులతో నూతిమడుగు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం

నూతిమడుగు విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి పోటీలకు 43మంది ఎంపిక

కళ్యాణదుర్గం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ పోటీల్లో కంబదూరు మండలం నూతిమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు 43 మంది అత్యంత ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో సోమవారం ఆయన పీడీలు ఓబులేసు, సంజీవరాయుడులతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. అక్టోబరు, నవంబరు నెలల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో అండర్- 14, 17, 19 గేమ్స్ కేటగిరీల్లో తమ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఆటతీరుతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఖోఖో, వాలీబాల్, ఆర్చరీ, హ్యాండ్ బాల్, వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడల్లో ఈ 43 మంది విద్యార్థులు అద్భుత ప్రదర్శన చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా వీరు రాణించాలని అభిలషించారు. గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పీడీలను అభినందించారు.

పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోండి

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి



బుక్కరాయసముద్రం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ శాస్త్రవేత్త(సేద్య విభాగం) డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో శనగలో పచ్చ పురుగు, మరూక మచ్చల పురుగు (గూడుపరుగు) ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. వర్షపు జల్లులతో కూడిన వాతావరణం లేదా మబ్బులతో కూడిన తేమ వాతావరణం ఉంటే ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. దీని నివారణకు లీటరు నీటికి ఎమామెక్టిన్ బెంజోయోట్ నోవాల్యురాన్ 1.5 ఎంఎల్, లేదా ధాయోక్లోప్రిడ్ ఫ్లూబెండమైట్ 1.25 ఎంఎల్ లేదా బోంజోయోల్ 0.4 ఎంఎల్ కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. రాబోయే మూడు రోజులు మబ్బులతో కూడిన వాతావరణం ఉంటుందని, అక్కడక్కడ చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షపాత సూచన ఉందని వెల్లడించారు. రైతులు వరి కోత పనులు వాయిదా వేసుకుంటే మంచిదని సూచించారు.

పప్పుశనగ పంటకు తెగుళ్లు

తుఫాన్ ఎఫెక్ట్...



- పిచికారీ తప్పక చేసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు
- రైతులపై మరింత ఆర్థిక భారం

← ఎండిన పప్పుశనగ మొక్క

పుట్లూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలో రబీలో సాగుచేసిన పప్పుశనగ పంటకు తెగుళ్ల బెడద పీడిస్తోంది. తుఫాన్ కారణంగా వారం రోజుల క్రితం కురిసిన వర్షాలతో పంటకు అగ్గి, ఏరుకుళ్లు, ఎండు తెగుళ్లు ఉధృతంగా సోకాయి. వీటిలో ఎక్కువగా ఎండుతెగుళ్లు రైతులను ముప్పుతిప్పలు పెడుతోంది. ఎండుతెగుళ్లు సోకిన పంటలో మొక్క కింది భాగం నుంచి కాండం పైవరకు ఎండిపోతోంది. ఇలా ఆ మొక్క నుంచి మరో మొక్కకు సోకుతూ పంట మొత్తం తెగుళ్లు విస్తరిస్తోంది. పప్పుశనగ పంటలోని వంక నార్వల్లో, గుంతలు ఏర్పడినచోట ఎక్కువనీరు నిల్వ ఉండడంతో పప్పుశనగ మొక్కలు కుళ్లిపోతున్నాయి. మరికొన్నిచోట్ల నీరు ఎండిపోయినా కూడా పంటలో ఎదుగుదల కనిపించడం లేదు. మండలంలోని పుట్లూరు, శనగలగూడూరు, గాండ్లపాడు, తక్కళ్లపల్లి, వెంగన్నపల్లి, నాగిరెడ్డిపల్లి, చెర్లోపల్లి, ఎస్. కొండేపల్లి, పోతిరెడ్డిపల్లి, నారాయణరెడ్డిపల్లి, మడ్డిపల్లి తదితర గ్రామాల్లో పప్పుశనగ పంటను ఎక్కువగా సాగుచేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది 15,300 ఎకరాల్లో శనగపంటను సాగుచేశారు. గతేడాది రబీలో వర్షం లేక పప్పుశనగను సాగుచేయలేదు. ఈ ఏడాది మాత్రం వర్షాలు బాగా రావడంతో రైతులు పప్పుశనగ పంటను ఎక్కువ గా సాగుచేశారు. అయితే రైతులను తెగుళ్లబెడద వదలడం లేదు. సాధారణంగా పప్పుశనగ పంటను పురుగులు ఆశించడం పరిపాటే. కానీ ఈ ఏడాది మాత్రం ఎండలు సరిగా లేకపోవడంతో తెగుళ్లు ఎక్కువయ్యాయి.

ట్రాక్టర్‌తో పప్పుశనగ పంటకు పిచికారి



ఎక్కువ ఖర్చు అవుతోంది



ఈ ఏడాది సకాలంలో వర్షాలు రావడంతో 11 ఎకరాల్లో పప్పుశనగ సాగుచేశాను. ఎండుతెగుళ్లు రావడంతో వాటికి క్రిమిసంహారక మందులను పిచికారి చేయాల్సి వస్తోంది. పెట్టుబడి కన్నా ఈ ఏడాది పిచికారి మందులకే ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చింది. తెగుళ్ల నివారణకు నెలలో రెండుసార్లు పిచికారి చేశా. పిచికారి మందులతో పాటు ట్రాక్టర్ బాడుగలు సైతం అధికమవుతున్నాయి. పెట్టిన పెట్టుబడికి దిగుబడి బాగా వస్తే గిట్టుబాటు అవుతుంది.

- గోవిందు, పప్పుశనగ రైతు, చెర్లోపల్లి


వేరు నుంచి ఎండిపోతోంది



పప్పుశనగ పంటను 12 ఎకరాల్లో సాగుచేశాను. ప్రస్తుతానికి పంట ఆశించిన స్థాయిలో ఉన్నా తెగుళ్లు మాత్రం ఎక్కువయ్యాయి. తెగుళ్లు భూమిలోని వేరు నుంచి పై కాండం వరకు కుళ్లిపోయి చివరికి ఎండిపోతోంది. ఇప్పటికే మూడు సార్లు పంటకు పిచికారి చేశాను. ఇంకా తెగుళ్లతో పాటు పూతకు, పంట ఎదుగుదలకు క్రిమిసంహారక మందులను పిచికారి చేయాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి రైతులకు పిచికారి మందులను ఎక్కువ మొత్తంలో సబ్సిడీ ద్వారా పంపిణీ చేస్తే బాగుంటుంది.

- శివశంకర్‌రెడ్డి, పప్పుశనగరైతు శనగలగూడూరు

సస్యరక్షణ చర్యలు తీసుకోండి




పప్పుశనగ పంటలో కనిపిస్తున్న ఎండుతెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. తప్పనిసరిగా క్రిమిసంహారక మందులను పిచికారిచేస్తే తెగులును నివారించవచ్చు. నీరు నిలిచిన చోట తడి ఆరిన వెంటనే శాప్ మందును పిచికారి చేస్తే ప్రయోజనం ఉంటుంది. మ్యాంకోజెబ్‌తో పాటు కార్బెండజిమ్ (శాప్)ను ఎకరానికి 400 గ్రాములు పిచికారి చేసుకోవాలి. లేకపోతే హెక్సాకొనజోల్ 400 మిలీ లేదా ప్రొపికోనజోల్ 200 మిలీ ఏదో ఒకటి మాత్రమే పిచికారి చేయాలి. పంటలో తెగులు సోకినచోట పిచికారి చేసే సమయంలో కాండం మొత్తం తడిచేలా చూసుకోవాలి.

- కాత్యాయిని, వ్యవసాయాధికారి

5న రండి..!

- యాడికి ఎంపీడీఓ కార్యాలయ అధికారులకు పిలుపు
- జడ్పీ సీఈఓ కార్యాలయానికి రావాలని ఆదేశం
- రికార్డుల మాయం నివేదికపై విచారణ

యాడికి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డుల మాయంపై సంబంధిత అధికారులు ఈనెల 5న జడ్పీ సీఈఓ కార్యాలయంలో హాజరు కావాలంటూ సీఈఓ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆ అధికారులు తమవద్ద ఉన్న ఆధారాలతో జడ్పీ సీఈఓ కార్యాలయంలో హాజరుకావడానికి సిద్ధమవుతున్నారు. 2019-20 నుంచి 2022-23 కాల వ్యవధికి సంబంధించి యాడికి మండల పరిషత్ నిధుల్లో సీనరేజస్ సెస్ కోట్ల రూపాయల్లో జమ అయ్యిందని, ఆ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేశారని, పనులపై విచారణ చేయాల్సిందిగా గతంలో కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అధికారిగా గుంతకల్లు డీఎల్‌డీఓను నియమించారు. ఆ అధికారి అక్టోబరు నెలలో యాడికి ఎంపీడీఓ కార్యాలయానికి విచారించారు. ఈ విచారణకు గతంలో పనిచేసిన ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, పీఆర్ ఏఈలు వరప్రసాద్, ఆదినారాయణరెడ్డి, ఆంజనేయులు, దేవకుమార్ హాజరయ్యారు. మరికొందరు గైర్హాజరయ్యారు. సాధారణ నిధులకు సంబంధించిన రికార్డులు, క్యాష్‌బుక్స్, వోచర్స్, వర్క్‌లిస్ట్, మండలపరిషత్‌లో ఆమోదించిన తీర్మానాలు విచారణ సమయంలో ఇవ్వలేదు. 2019-2020లో సాధారణ నిధులకు సంబంధించిన క్యాష్‌బుక్ మాత్రమే విచారణలో చూపించినట్లు తెలిసింది. 2019-2023కు సంబంధించి రికార్డులు ఇవ్వలేదు. 2019-2023 మధ్యకాలంలో రూ.3,54,23,290 సీఎఫ్ఎంఎస్ ద్వారా ట్రాన్స్‌క్షన్ జరిపినట్లు విచారణలో తేల్చారు. ఈఎండీ ద్వారా 2021 జూన్9న బి. రామచంద్రారెడ్డికి రూ.50వేలు, 19-06-2021న రూ.2.50లక్షలు సెల్ఫ్‌గా అదే ఏడాది జూలై 9న రూ.1.40లక్షలు, 20-01-2022న రూ.7వేలు, 19-06-2024న రూ.26వేలు డ్రా చేసుకున్నట్లు బ్యాంక్‌స్టేట్‌మెంట్‌లో గుర్తించారు. ఈఎండీ అమౌంట్‌ను కాంట్రాక్టర్ అభ్యర్థన మేరకు కాంట్రాక్టర్‌కు ఇవ్వవలసి ఉంటుంది. వీటికి సంబంధించిన రికార్డులు కూడా ఎంపీడీఓ కార్యాలయంలో లేవని తెలిపారు. రికార్డులు అందించడానికి 15రోజులు సమయం ఇచ్చినా అధికారులు ఇవ్వలేకపోయారని నివేదికలో తెలిపారు. రికార్డు లు లేనందున పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించలేకపోయామని పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగం, విచారణకు రికార్డులు అందించలేని సంబంధిత అధికారులపై సీసీఏ రూల్స్‌మేరకు చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ విజయలక్ష్మి జడ్పీ సీఈఓకు నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా అప్పటి ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్‌డీ వెంకటేష్‌లను ఈనెల 5న జడ్పీ సీఈఓ కార్యాలయంలో హాజరుకావాలని ఆదేశిస్తూ సీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.


NOTICE

రికార్డులు, ఫైల్స్‌తో సీఈఓ కార్యాలయంలో హాజరుకావాలని వచ్చిన ఆర్డర్


అసలైన వారిని తప్పిస్తున్నారా?

2019-2023 మధ్యకాలంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పనిచేసిన అధికారిని వదిలేసి ఎవరినో బాధ్యులను చేస్తూ విచారణకు హాజరుకావాలంటూ ఉత్తర్వులు ఇవ్వడంపై విమర్శలు వినవస్తున్నాయి. అప్పట్లో రెగ్యులర్ ఎంపీడీఓ ఉన్నప్పటికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పెత్తనం చెలాయించిన ఆ అధికారిపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్ ఎంపీడీఓగా ఉన్న కొండయ్య వేతనాన్ని కూడా సీఎఫ్ఎంఎస్‌లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్న అనిల్ కుమార్ మంజూరు చేయడం తెలిసిందే. రికార్డులు, ఎం.బుక్కులు చూపించాల్సిన ఆ అధికారి విచారణకు హాజరుకాలేదు. రికార్డులు అప్పగించని వైనంపై చర్యలు తీసుకోవాలని విచారణ అధికారి గుంతకల్లు డీఎల్‌డీఓ జిల్లా పరిషత్ సీఈఓకు నివేదిక ఇచ్చారు. అయితే ఆ అధికారిని విచారణకు పిలవకుండా ఇతర అధికారులను పిలవడంలో ఆంతర్యమేమిటో అని మండల పరిషత్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. రికార్డులు మాయం చేసిన ఆ అధికారి ఒక ప్రజాప్రతినిధి సిఫార్సు ద్వారా చర్యలు తీసుకోకుండా జాగ్రత్తపడినట్లు సమాచారం.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

బాబూ రాజేంద్రప్రసాద్ (జయంతి)



దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 1884 డిసెంబరు 3న బీహార్ రాష్ట్రం శివాన్ జిల్లా జెర్దాయ్ గ్రామంలో జన్మించారు. 1950 నుంచి 1962 వరకు రాష్ట్రపతి హోదాలో కొనసాగారు. అంతకుముందు స్వాతంత్ర్య పోరాటంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ ముసాయిదా తయారీ సంఘానికి అధ్యక్షత వహించారు. తదుపరి రాజ్యాంగ పరిషత్ ద్వారా 1950లో తొలి రాష్ట్రపతిగా ఎన్నుకోబడ్డారు. ఉన్నత పదవులలో ఉన్నవారు స్వతంత్రంగా వ్యవహరించేందుకు కాంగ్రెస్ పార్టీ రాజకీయాలనుంచి వైదొలగి కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పారు. నేటికీ ఇదే విధానం కొనసాగుతోంది. అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు పలు సందర్భాలలో సలహాలిచ్చారు. 1957లో రెండోసారి రాష్ట్రపతిగా ఎన్నిక కావడం ద్వారా చరిత్ర సృష్టించారు. కాగా ఆయన సాహిత్యంలోనూ తన ప్రతిభ చాటుకోవడం గమనార్హం. 1963 ఫిబ్రవరి 28న కన్నుమూశారు.

బందా కనకలింగేశ్వరరావు (వర్ధంతి)



సుప్రసిద్ధ రంగస్థల, సినిమా నటుడు బందా కనకలింగేశ్వరరావు 1907 జనవరి 20న కృష్ణా జిల్లా ఆటపాక గ్రామంలో జన్మించారు. ఏలూరులో 1938లో నాటక కళాశాలను ప్రారంభించి పలువురు నటులకు శిక్షణ ఇచ్చారు. ప్రభాత్ థియేటర్‌ను స్థాపించి నాటక ప్రయోక్తగా పలు నూతన ప్రదర్శన రీతులను ప్రవేశపెట్టారు. తొలితరం సినిమాలు బాల నాగమ్మ, సారంగధర, పాదుకా పట్టాభిషేకం తదితర సినిమాలలో నటించారు. ఆకాశవాణిలోనూ నాటక ప్రయోక్తగా నాటకాలు ప్రదర్శించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు, రాష్ట్రపతి అవార్డు తదితర గౌరవాలు అందుకున్నారు. 1968 డిసెంబరు 3న కన్నుమూశారు. ఆయన గౌరవార్థం ఆటపాక గ్రామంలో శిలావిగ్రహం ఏర్పాటు చేశారు.

దేవానంద్ (వర్ధంతి)



ప్రముఖ హిందీ సినీనటుడు, దర్శక నిర్మాత దేవానంద్ 1923 సెప్టెంబరు 26న పంజాబ్ రాష్ట్రం గురుదాస్‌పూర్ జిల్లా శకర్‌గర్ ప్రాంతంలో జన్మించారు. ఆరు దశాబ్దాలకుపైగా 114 సినిమాలలో నటించారు. సినీరంగంలో ఎవర్‌గ్రీన్ రొమాంటిక్, హ్యాండ్‌సమ్ నటుడిగా నిలిచారు. ఉత్తమ నటుడిగా ఫిల్మ్‌ఫేర్, దాదాసాహెబ్ ఫాల్కే తదితర పురస్కారాలు అందుకున్నారు. అతను నటించిన గైడ్ సినిమా ఆస్కార్‌కు ప్రవేశించడం విశేషం. 2011 డిసెంబరు 3న కన్నుమూశారు. అప్పుడప్పుడు హాలీవుడ్ హీరో గ్రెగరీ పెక్‌తో ఆయనను అభిమానులు పోల్చేవారు. కాగా దేశ సినీరంగం వందేళ్ల సందర్భంగా ఆయన పేరిట ప్రత్యేక పోస్టల్‌స్టాంప్ విడుదల చేశారు.

బాలల్లో సాహిత్యాభిలాష పెరగాలి

● జాతీయ పురస్కార గ్రహీత నాగవేణి

దొమ్మసంద్ర, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అందరిలో సాహిత్యం పెంపొందించేలా చందాపురకు చెందిన యశస్విని మహిళా మండలి సమాఖ్య ఆధ్వర్యంలో 'ఇంటింటా సాహిత్య చింతన' అనే కార్యక్రమాన్ని చేపట్టింది. జాతీయ పురస్కార గ్రహీత నాగవేణి మాట్లాడుతూ చిన్మయ సేవా సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ పురస్కార గ్రహీతలు, ఇతర సాహితీ పరిశోధకులు, ప్రముఖుల గురించి తెలిపేలా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కన్నడ సంస్కృతి పరంపరను భావితరాలకు అందించేలా ప్రోత్సహిస్తున్నారన్నారు. చిన్మయ సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ చిన్నప్ప వై చిక్కహేగడె మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో కన్నడ రాష్ట్ర చరిత్ర తెలిపే మహనీయుల సాధనలను తెలిపేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బ్యాలం నుంచే పుస్తకపఠనంపై ఆసక్తి పెంచాలని అభిప్రాయపడ్డారు. పాఠ్యపుస్తకాలతోపాటు జానపదం, భాషా సంస్కృతులపై అవగాహన కల్పించడమే ఉద్దేశ్యమన్నారు. స్థానికంగా ఉంటున్న ఇతర రాష్ట్రాల వారికి కన్నడ భాషను నేర్పించాలన్నారు. తద్వారా భాషా పురోగతి సాధ్యమన్నారు. జానపద గాయకుడు రాజేశ్ పాటలు 328కుపైగా ఉండగా వాటిలో చాలావరకు కనుమరుగయ్యాయని గ్రామీణ సొగసుపై ఆసక్తి తగ్గుతోందని కొంత విచారం వ్యక్తం చేశారు. రానున్నరోజుల్లో జానపదంపై ఆసక్తి కల్పించేలా విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా 40 మంది విద్యార్థులకు రామాయణ, మహాభారతాలకు సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పురసభ సభ్యురాలు అన్నపూర్ణ, జగదీశ్ ఆచారి, యశస్విని మహిళా సమాఖ్య డైరెక్టర్ వెంకటమ్మ, టీఎస్ కుమార్ ఆచారి, ఉపాధ్యాయులు శ్వేతా మహేశ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో చిన్మయ సేవా సంస్థ ప్రముఖులు తదితరులు

ఏకాగ్రతతో చదివితేనే గ్రూప్స్‌లో సాధించవచ్చు

▸▸ యూపీఎస్‌సీ మాజీ చైర్మన్ డీపీ అగర్వాల్



విద్యార్థులతో డీపీ అగర్వాల్

బెంగళూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏకాగ్రతతో చదివితేనే గ్రూప్స్ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చునని యూపీఎస్‌సీ మాజీ చైర్మన్ డీపీ అగర్వాల్ అభిప్రాయపడ్డారు. నగరంలో ఐఏఎస్ కోచింగ్ పొందుతున్న విద్యార్థులతో చర్చాగోష్ఠిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సలహాలు ఇచ్చారు. రెండు గంటలపాటు పరీక్ష రాసే ఏకాగ్రతను సాధించుకోవాలన్నారు. జ్ఞానంతోపాటు పరీక్షల ఒత్తిడిని అధిగమించడం కీలకమన్నారు. నిరంతరం చదువుకంటే వ్యక్తిత్వ వికాసాన్ని అలవరుచుకోవాలని తద్వారా చదివింది అర్థం చేసుకునేందుకు వీలుంటుందన్నారు. ఏటా 6 లక్షలమంది పరీక్షల్లో పాల్గొంటే కేవలం వెయ్యిమందికి మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా ప్రయత్నించాలన్నారు. ఐఏఎస్ కావాలంటే ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఇలా మూడు స్టేజ్‌లు కీలకమే అన్నారు. ప్రతిరోజూ పత్రికలు చదివి దేశ విదేశాల సమాచారాన్ని తెలుసుకోవాలన్నారు. ఆంగ్లంలో పరీక్షలు రాసి కన్నడలోనూ ఇంటర్వ్యూ ఎదుర్కోవచ్చునన్నారు. గ్రేస్ ఐఏఎస్ సంస్థ డైరెక్టర్ సంజు సింగ్ చౌహాన్, ధ్రువకుమార్, గౌరవ్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఫిలిప్పీన్స్ నర్సుకు అరుదైన గౌరవం

▸▸ మరియ విక్టోరియాకు ఏస్టర్ గార్డియన్ పురస్కారం



పురస్కారం అందచేస్తున్న స్పీకర్ యూటీ ఖాదర్ తదితరులు

బెంగళూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫిలిప్పీన్స్‌లో ఆర్మీ హెల్త్ సర్వీసెస్‌లో నర్సుగా కొనసాగుతున్న మరియ విక్టోరియా జువాన్‌కు ప్రతిష్టాత్మకమైన ఏస్టర్ గార్డియన్ గ్లోబల్ నర్సింగ్ అవార్డు 2024తో సత్కరించారు. నగరంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రదానం చేశారు. శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు, బాలీవుడ్ నటి సోనాలి బెంద్రే, ఏస్టర్ డీఎం హెల్త్‌కేర్ డైరెక్టర్ అలిషా మూపెన్, సీఓ డైరెక్టర్ టీజే విల్సన్‌లు పాల్గొన్నారు. ఏస్టర్ గార్డియన్ గ్లోబల్ నర్సింగ్ పురస్కారాన్ని 2001లో ప్రారంభించినట్టు అలిషా మూపెన్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 202 దేశాలలో 78వేల మంది దరఖాస్తు చేసుకోగా ప్రత్యేక కమిటీ పరిశీలనల తర్వాత ఫిలిప్పీన్స్ దేశానికి చెందిన మరియ విక్టోరియాను ఎంపిక చేశామన్నారు. పురస్కారం కింద రూ.2కోట్ల నగదు రివార్డు అందచేశారు. ప్రపంచ ఆరోగ్యసంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ ఘెబ్రియేసెస్ ప్రత్యేక సందేశం పంపారన్నారు. మరియ విక్టోరియా జువాన్ మాట్లాడుతూ ఫిలిప్పీన్స్‌లో ఆర్మీహెల్త్ విభాగంలో నా సేవలకు అంతర్జాతీయ గుర్తింపు వస్తుందని ఊహించలేదన్నారు. యుద్ధ ప్రదేశంలో సేవలందించడం ప్రమాదాలలో గాయపడ్డ సైనికులకు సేవలందించడాన్ని సంతోషంగా భావించానన్నారు. సైనికుల ధైర్యానికి వారికి అందిస్తున్న సేవల ద్వారా గుర్తించానన్నారు.

హెచ్ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

శిడ్లఘట్ట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ ఎయిడ్స్ అనేది సోకితే పూర్తి నివారణ సాధ్యం కాదని కేవలం నియంత్రణ మాత్రమే ఉంటుందని జీవితాంతం ఎన్నో అంశాలలో మార్పు పాటించాల్సి ఉంటుందని శిడ్లఘట్ట ప్రభుత్వ ఆసుపత్రి పాలనాధికారి డాక్టర్ మనోహర్ అభిప్రాయపడ్డారు. వరల్డ్ ఎయిడ్స్ డేలో భాగంగా సోమవారం ఆసుపత్రిలో ప్రత్యేక జాగ్రతి సమావేశం నిర్వహించారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వంటివి రాకుండా కనీస జాగ్రత్తలు పాటించాలిసి ఉందన్నారు. ఒకవేళ సోకితే సుమారు పదేళ్లపాటు బతికే అవకాశాలు ఉంటాయంటే చికిత్సల ద్వారా మరికొన్నేళ్లు పెంచే అవకాశం ఉంటుందన్నారు. కావున రోగాలు రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్యక్రమంలో తాలూకా ఆరోగ్యాధికారి డాక్టర్ వెంకటేశ్‌మూర్తి, న్యాయవాదుల సంఘం కార్యదర్శి భాస్కర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



అవగాహనలో వైద్యులు తదితరులు

పోటీపడి వేగం.. ప్రైవేట్ బస్సుల ఢీ

▸▸ ప్రయాణికులకు గాయాలు

దెబ్బతిన్న బస్సు ఇదే..



చింతామణి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బెంగళూరు - మురగమల్లా మార్గంలో ప్రైవేట్ బస్సులు పోటీపడి ఓవర్‌టేక్ చేసిన ఘటనలో ఢీ కొనడంతో ప్రయాణికులు గాయపడ్డారు. సోమవారం మధ్యాహ్నం 2.45 గంటలకు రెండు ప్రైవేట్ బస్సులు పోటీ పడ్డాయి. పట్టణంలోని బెంగళూరు డబుల్‌రోడ్డులోని శని మహాత్ముడి దేవాలయం వద్ద హంప్‌ల నుంచి ఎంబీఎస్ బస్సును ఓవర్‌టేక్ చేయడం మొదలుపెట్టి చివరకు వాహనాన్ని ఢీ కొన్నాడు. దీంతో కల్పవృక్ష బస్సులోని పలువురు ప్రయాణీకులు గాయపడ్డారు. ఘటనా స్థలానికి పట్టణ పోలీసులు చేరుకుని బస్సులను సీజ్ చేశారు. కల్పవృక్ష బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా పలుమార్లు ఓవర్ టేక్ చేశారని ప్రయాణీకులు చెప్పినట్టు పోలీసులు తెలిపారు.

మరణంలోనూ వీడని బంధం

● కృష్ణగిరి జిల్లాలో ఒకేరోజు కన్నుమూసిన వృద్ధ దంపతులు

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాల పాటు కలిసి కాపురం చేసిన దంపతుల్ని మృత్యువు కూడా విడదీయలేకపోయింది. ఆద్యంతం అన్యోన్యంగా గడిపిన ఆ దంపతులు ఒకే రోజు రాత్రి నిద్రలోనే మరణించడం పలువురిని కలచివేసింది. వివరాలిలా... కృష్ణగిరి జిల్లా డెంకణికోట సమీపంలోని మేగలపుండనూరు గ్రామానికి చెందిన గోవిందస్వామి (90), రామక్క (75) దంపతులకు ఇద్దరు కుమారులు, ఐదుగురు కుమార్తెలున్నారు. అందరికి వివాహమై వేర్వేరుగా జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి గోవిందస్వామి పిల్లలు కొంతమంది తల్లిదండ్రుల కు ఆహారం అందించి వెళ్లారు. అయితే రాత్రి నిద్రపోయిన దంపతులు ఆదివారం ఉదయం ఎంతసేపటికీ లేవలేదు. దీంతో ఇరుగుపొరుగు వారు లేపేందుకు ప్రయత్నించగా, అచేతనంగా పడివున్నారు. అప్పటికే వారిద్దరూ తుది శ్వాస విడిచినట్లు తేలింది.

ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు



పురస్కారంతో సత్కారం ఇలా...

బెంగళూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ప్రతిభతో రాణించిన వారికి ఎఫ్‌ఏపీ అవార్డుల ప్రదానంలో పలువురికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. బెంగళూరు సన్‌రైజ్ పబ్లిక్‌స్కూల్ ఉపాధ్యాయురాలు కీర్తన డి., అనుపమ విద్యామందిరకు చెందిన టీచర్ అశ్విని.పి, బ్లూమూన్ పబ్లిక్‌స్కూల్ టీచర్ మహేశ్‌లకు చండీఘడ్ యూనివర్సిటీ, క్యామ్స్ సంయుక్తంగా ఏర్పాటైన ఎఫ్‌ఏపీ అవార్డుల ప్రదానంలో పురస్కారాలతో సత్కరించారు. కార్యక్రమంలో క్యామ్స్ కార్యదర్శి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగలముద్దమ్మ ఆలయంలో విశేష పూజలు

శిడ్లఘట్ట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శిడ్లఘట్ట తాలూకాలోని మళ్ళూరు గ్రామంలో కొలువైన నాగలముద్దమ్మ దేవి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. అమ్మవారికి క్షీరాభిషేకం, అలంకరణ నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు పాల్గొన్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు పలు ధార్మిక కార్యక్రమాలు కొనసాగాయి. ఆలయంలోని గణపతి, సుబ్రమణ్య, పరివార దేవతలకు పూజలు నిర్వహించారు. కళశాలతో మహిళలు గ్రామంలో ఊరేగారు. నాదస్వరాలు, జానపద బృందాలు సందడి చేశాయి. మళ్ళూరులో భక్తుల కోలాహలం నెలకొంది.



మళ్ళూరు గ్రామంలో కలశాలతో ఊరేగుతున్న భక్తులు

వరద బీభత్సం

చెన్నై, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో కుండపోత వర్షాలు కురిసి మూడు జిల్లాలను ముంచెత్తాయి. విల్లుపురం, కృష్ణగిరి, కడలూరు జిల్లాల్లో 40 నుంచి 50 సెం.మీ.లకు పైగా కుండపోతగా వర్షం కురిసింది. దీంతో ఆ జిల్లాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించింది. చెరువులు, వాగులు, వంకలు నిండి కట్టలు తెంచుకుని జనావాస ప్రాంతాలపై పొంగి ప్రవహిస్తున్నాయి. కృష్ణగిరి జిల్లాల్లో రెండు రోజులపాటు కుండపోతగా కురిసిన వర్షాలకు జనజీవనం పూర్తిగా స్తంభించింది. ఫెంగల్ తుఫాను ప్రభావంతో శనివారం ప్రారంభమైన వర్షాలు ఆదివారం ఉదయం వరకూ కొనసాగాయి. జిల్లాలోని ఊత్తాంగరైలో ఆదివారం 50 సెం.మీ. మేర వర్షం కురిసింది. ఊత్తాంగరై సమీపంలోని ఎక్కూరు అమ్మన్ చెరువు గండ్లు తెగి నీరు రహదారులను ముంచెత్తింది. వరద తాకిడికి రహదారి పక్కన ఉన్న వ్యాన్లు, కార్లు కొట్టుకుపోయాయి. వేల ఎకరాల్లో వరి నీట మునిగింది. పాంబారు డ్యామ్‌కు వస్తున్న నీటిని అలాగే దిగువకు వదిలేయడంతో డ్యాం పరీవాహక ప్రాంతాలైన మూండ్రాంపట్టి, పావక్కల్, అత్తిపాడి పంచాయతీల పరిధిలోని గ్రామాలకు వరద హెచ్చరికలు జారీ చేశారు. పోచ్చంపల్లి పోలీసుస్టేషన్‌లో వరదనీరు ప్రవేశించింది. ఇదే విధంగా ధర్మపురం, సేలం, నామక్కల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఏర్కాడులో మూడు రోజులుగా కురిసిన వర్షాలకు 40 అడుగుల వంతెన వద్ద మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. దీనితో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి.

విల్లుపురం జిల్లా తెన్‌పెన్నైయారులో నీటి ఉధృతి



గౌరవం లేదు.. వేతనమూ లేదు..!

● జీతాల కోసం ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీల ఎదురుచూపు



కొత్తచెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆర్థిక విధ్వంసం సాగించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులకు సమయానికి వేతనం అందింది లేదు. నెలాఖరులో ఇచ్చిన సందర్భాలు కోకొల్లలు. వేతన వెతలు ఉద్యోగులకే కాదు.. ప్రజాప్రతినిధులకూ తప్పలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు కూడా గౌరవ వేతనం 15 నెలలుగా అందలేదు. ఉమ్మడి జిల్లాలో 63 మండలాలున్నాయి. మండలానికి ఒకరు చొప్పున 63 మంది జడ్పీటీసీలు ఉన్నారు. వీరిలో ఒకరు మృతి చెందగా 62 మంది ఉన్నారు. 63 మంది ఎంపీపీలకుగాను ఇద్దరు పదవులకు రాజీనామా చేశారు. ఉమ్మడి జిల్లాలో 841 మంది ఎంపీటీసీలు ఉండగా.. ఇందులో 12 మంది మృతిచెందారు. ఇద్దరు పార్టీ మారారు. జడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవవేతనం నెలకు రూ.8 వేలు, ఎంపీటీసీలకు రూ.3 వేలు చొప్పున అందాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ, మండల పరిషత్‌ల అభివృద్ధిని అటకెక్కించింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సైతం దారి మళ్లించింది. దీంతో ఎంపీపీలు, ఎంపీటీసీలకు అందాల్సిన గౌరవ వేతనం కూడా నిలిచిపోయిందని వాపోతున్నారు.

ఆశలపై నీళ్లు

గత వైసీపీ హయాంలో పాలకుల దౌర్జన్యాలు పరాకాష్ఠకు చేరాయి. పోలీసులతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని తెలుగుదేశం పార్టీ పరిషత్ బహిష్కరించింది. దీనితో ఎన్నికల బరిలో వైసీపీ మాత్రమే నిలిచింది. ఉమ్మడి జిల్లాలో 90 శాతం మందికిపైగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా వైసీపీ వారే ఎన్నికయ్యారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులమనీ, నిధులు దండిగా వస్తాయనీ, మండలాలు, గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చని ఆనందపడ్డారు. వారి ఆశలపై అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. పైసా కూడా నిధులు విదల్చలేదు. పైగా కేంద్రం ఇచ్చిన 15వ ఆర్థిక సంఘం ఇతరత్రా నిధులను సైతం దారి మళ్లించింది. దీంతో ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కన్న కలలన్నీ కల్లలయ్యాయి. నిధులు, పనుల సంగతి దేవుడెరుగు, చివరకు గౌరవ వేతనం కూడా దక్కలేదు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం ద్వారానైనా సమాజంలో గౌరవం పొందవచ్చనుకున్నారు. ఆ అవకాశం కూడా ఇవ్వలేదు నాటి ప్రభుత్వం. వార్డు, గ్రామ వలంటీర్ల ద్వారా పథకాలను ప్రజలకు అందజేశారు. దీంతో గౌరవం, గౌరవ వేతనం రెండూ లేకుండా పోయాయని వారు వాపోతున్నారు.


ఆఫీసులకు రాం.. రాం..

రాష్ట్రంలో పాలకపక్షం మారడంతో చాలా మండలాల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రభుత్వ కార్యాలయాలకు రావడమే తగ్గించేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంలేదని తెలుస్తోంది. ఆ దరిదాపుల్లోకే వారు రావట్లేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పల్లెల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పుడైనా గౌరవ వేతనం అందుతుందా అని స్థానిక సంస్థల ప్రతినిధులు ఆశగా చూస్తున్నట్లు తెలుస్తోంది.

త్వరలోనే ఖాతాలకు జమవుతుంది

ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవ వేతనానికి సంబంధించి ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వేతనం మంజూరు చేసింది. బిల్లు పెట్టాం. త్వరలోనే వారి ఖాతాలకు జమవుతుంది. ఇంకా.. పది నెలల గౌరవ వేతనం ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉంటుంది.

-వెంకటసుబ్బయ్య, జడ్పీ సీఈఓ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.72	1,592.70
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,783	768
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,563	3,322
నీటి నిల్వ (టీఎంసీలు)	93.02	13.43

దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి గాంధీనగర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్టీ వర్గాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2024-25 సంవత్సరానికి సంబంధించి డ్రోన్ ఆధారిత ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ ద్వారా సామాజిక మాధ్యమాల్లో ఉద్యోగం పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆసక్తి కలిగిన ఎస్టీ యువతి, యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి దివాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఎస్ఎస్ఎల్‌సీ పాసై, 18 నుండి 45 సంవత్సరాల లోపు వయస్సు ఉంటే శిక్షణకు అర్హులు. మరింత సమాచారం కోసం నగరంలోని నల్లచెరువు ప్రాంతంలోని ఎస్టీ వర్గాల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని సందర్శించి వివరాలు పొందవచ్చని తెలిపారు.

నేడు అభినందన కార్యక్రమం

సిరుగుప్ప, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక నీలకంఠేశ్వరాలయంలో మంగళవారం నూతనంగా ఎన్నికైన ప్రభుత్వ ఉద్యోగుల సంఘానికి ఎన్నికైన అధ్యక్షులు, డైరెక్టర్లకు అభినందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఉచ్చీరప్ప విలేకరులతో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే సోమలింగప్ప ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఉద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అమరవీరులకు నివాళి



మొక్కలు నాటుతున్న టర్కీ రాయబారి ఫిరత్ సునెల్

బళ్లారి సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని కౌళగల్ వివామానాశ్రాయానికి ఆనుకుని ఉన్న టర్కీ అమరవీరుల శ్మశాన వాటికను ఆదివారం టర్కీ రాయబారి హెచ్ఈ ఫిరత్ సునెల్ సందర్శించారు. టర్కీ పెద్దల సమాధులకు నివాళులర్పించి అక్కడ మొక్కలు నాటారు. అనంతరం విమ్స్ శ్మశాన వాటిక వద్ద చేపట్టిన పనులను వివరించి స్మారక యుద్ధనౌకను సందర్శించారు. ఈసందర్భంగా పర్యాటక శాఖ ఉపసంచాలకుడు ప్రభులింగ తాళకేరి, సిబ్బంది శ్రీహరి మననూరు, టూర్ గైడ్ విరూపాక్షి, టర్కీ మ్యాట్రీస్ శ్మశానవాటిక ఇన్‌చార్జి ఇబ్రహీం పాల్గొన్నారు.

కళాకారులను గుర్తించండి

కంప్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కళాకారులను గుర్తించాలని గోవర్ధన నందాపురి మహాస్వాములు కోరారు. సోమవారం వడ్డట్టి గ్రామంలో దుర్గాదేవి దేవస్థానంలో కన్నడ మరియు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో బసవేశ్వర కళాట్రస్టు ఆధ్వర్యంలో గ్రామీణ సాంస్కృతిక రంగోత్సవం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో మంది కళాకారులు అవకాశం లభించక ఇళ్లకే పరిమితమయ్యారు. తిమ్మారెడ్డి, డాక్టర్ ఆచార్య, శివరుద్రస్వామి, దివాకర్, యర్రిస్వామి, పురుషోత్తమ్, సంఘం జిల్లా అధ్యక్షులు పార్వతేష్, ఉలిగయ్య, అమరేష్ పాల్గొన్నారు.

7న ఫ్లాగ్ డే

హోసూరు(కృష్ణగిరి), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మన దేశ సరిహద్దు రక్షణలో నిమగ్నమైన త్రివిధ దళాల సైనికులకు నివాళులు అర్పిస్తూ, తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడానికి ప్రతి సంవత్సరం డిసెంబరు 7న ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్‌డేను ఆచరిస్తారు. యుద్ధంలోనూ, విధులలోనూ ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు గౌరవంగా వారి కుటుంబాల సంక్షేమం కోసం ఫ్లాగ్ డేలో భాగంగా విరాళాలు సేకరిస్తున్నట్టు కలెక్టర్ సరయు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 7న శనివారం ఉదయం 10 గంటలకు ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు.

తెలుగు భాష గొప్పతనాన్ని దేశ నలుమూలలా చాటుదాం

● రాష్ట్రేతర తెలుగు సమాఖ్య సదస్సులో వక్తలు

బళ్లారి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష గొప్పతనాన్ని దేశ నలుమూలలా మరో సారి చాటిచెబుదామని, దేశంలో ఏ రాష్ట్రంలో తెలుగువాళ్లు ఉన్నా తెలుగు భాషకు ప్రాముఖ్యత ఇవ్వాలని రాష్ట్రేతర తెలుగు సమాఖ్య సదస్సుల్లో ప్రముఖ వక్తలు మండలి బుద్ధప్రసాద్, సినీనటుడు సాయికుమార్, సుందరరావు, గజ్జల శ్రీనివాస్, కోటేశ్వరావు. తదితర ప్రముఖ వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని షిరిడీలో నవంబరు 30 నుంచి డిసెంబరు 2 వరకు మూడు రోజుల పాటు రాష్ట్రేతర తెలుగు సమాఖ్య సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సుకు కర్ణాటక, ఒడిస్సా, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, కేరళ, ఢిల్లీ, చత్తీస్‌గడ్ ఇలా దాదాపు 15 రాష్ట్రాల నుంచి తెలుగు వారు హజరయ్యారు. సదస్సును ప్రముఖులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అంతక ముందు షిరిడీ పుర వీధుల్లో తెలుగువారు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సదస్సులో ప్రముఖులు మాట్లాడారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో తెలుగు వారు విస్తరించి ఉన్నారని అధ్యక్షుడు మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. తమిళనాడు ప్రభుత్వం తెలుగును రెండో అధికార భాషగా ప్రకటించనుందని గుర్తు చేశారు. కర్ణాటకలో కూడా తెలుగును రెండో అధికార భాషగా పెట్టిందుకు కృషి చేస్తున్నామని న్యాయవాది. రాష్ట్రేతర తెలుగు సమాఖ్య కార్యదర్శి కోటేశ్వరావు అన్నారు. క్యాక్రమంలో వీరితోపాటు విజయనగర తెలుగు సంఘం నాయకులు వెంకటేశ్వరావు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ సంచాలకులు డాక్టర్ మునిరత్నం నాయుడు హాజరయ్యారు. రాష్ట్రేతర సమాఖ్య కమిటీ ఏర్పాటు చేశారు.



రాష్ట్రేతర సమాఖ్య సమావేశంలో ప్రవాసాంధ్రులు

బాలల హక్కులను పరిరక్షించాలి

● రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు శశిధర కొసంబే



బళ్లారి సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బాలల చట్టబద్ధమైన హక్కులను కాపాడేందుకు వివిధ శాఖల అధికారులు సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు శశిధర కొసంబే సూచించారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బెంగళూరు, జిల్లా న్యాయసేవల ప్రాధికార సంస్థ జిల్లాపరిపాలన, జిల్లా పంచాయతీ , మహిళా శిశు అభివృద్ధి శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం జిల్లాపంచాయతీ హాల్లో బాల్యవివాహాలు, ఫోక్స్ సమాచార హక్కు చట్టం, బాలల రక్షణ జిల్లాస్థాయి అధికారుల కోసం సోమవారం నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాలల వేధింపులకు పాల్పడితే బాల్య వివాహాల నిషేధం, నిర్బంధ విద్యాహక్కు చట్టం, పోక్సో తదితర చట్టాల ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయన్నారు. రాష్ట్రంలో గత మూడేళ్లలో 10వేలకు పైగా ఫోక్సో కేసులు నమోదు కాగా, 202 కేసుల్లో శిక్షను ప్రకటించారు. ఈవిషయంలో బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సమాజంలోని ప్రతిఒక్కరూ పిల్లల పట్ల అత్యంత సున్నితత్వాన్ని ప్రదర్శించాలి. శిశు మరణాలు, మాతాశిశు మరణాల నివారణకు తగిన చర్యలు తీసుకోవడం అవసరమన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల 17కార్యక్రమాల్లో 9 కార్యక్రమాలు బాలలు, మహిళల అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. బాలల హక్కుల సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రటరీ, సీనియర్ సివిల్ న్యాయాధికారి రాజేష్ హొసమనె మాట్లాడుతూ.. బాలల హక్కులను చట్టపరంగా పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన, స్వచ్ఛంద సంస్థలపైనా ఉందన్నారు. మహిళా శిశు అభివృద్ధి శాఖ ఉపసంచాలకుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతి రెండు, మూడు నెలలకోసారి వివిధ కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులు, మహిళలకు అనుకూలంగా చట్టపరమైన చర్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇదే సమయంలో పిల్లల హెల్ప్ లైన్ 1098, పోక్సో చట్టం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ రీజినల్ కుటుంబ సంక్షేమ అధికారి రాఘవేంద్ర భట్, పోలీససూపరింటెండెంట్ రమేశ్‌బాబు, చైల్డ్ వేల్ఫేర్ కమిటీ ఛైర్ పర్సన్ విజయలక్ష్మి మైదూరు,నాగప్ప, జిల్లా తాలూకా స్థాయితోపాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది జిల్లా బాలల సంరక్షణ విభాగం, ప్రభుత్వ శిశు సంక్షేమ సంస్థ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

వరికి మద్దతు ధర కల్పించాలి: ఏఐకేకేఎంఎస్

బళ్లారి సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరికి క్వింటాల్‌కు రూ. 3500 మద్దతు ధర కల్పించాలని అఖిల భారత రైతు కృషి కార్మిక సంఘం (ఏఐకేకేఎంఎస్) డిమాండ్ చేసింది. సోమవారం నగరంలోని గాంధీభవన్ నుంచి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడుతూ వరికి క్వింటాల్‌కు రూ. 3500 మద్దతు ధర ఇవ్వాలని, డిసెంబరు మొదటి వారం నుంచి కొనుగోలు కేంద్రం ప్రారంభించాలని, నష్టపోయిన రైతులకు పరిహారం పంపిణీ చేయాలని కోరారు. వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ఎలాంటి హద్దులు లేకుండా పరిహారం చెల్లించాలన్నారు. రైతుల వరి ధాన్యాన్ని ఉచితంగా నిల్వ చేసేందుకు ప్రభుత్వ గోడౌన్లు ఏర్పాటు చేయాలని, వరికోత యంత్రాలకు గంటకు రూ.2300 కంటే ఎక్కువ వసూలు చేయరాదని ఆదేశాలు జారీ చేయాలన్నారు. అధిక ధరలు వసూలు చేసే యంత్రాల యజమానులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. నిరసనకు అధ్యక్షత వహించిన జిల్లా కార్యదర్శి గురల్లిరాజా మాట్లాడుతూ.... ఈపోరాటం ప్రారంభమని ప్రభుత్వం తక్షణమే వరి కొనుగోళ్లు ప్రారంభించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. అన్నదాతల సమస్యలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమంతప్ప, యువజన నాయకుడు కోలూరు పంపాపతి మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో పాడిరైతుల పోరాట కమిటీని ఏర్పాటు చేసి పోరాటాన్ని కొనసాగించాలన్నారు. ప్రభుత్వం దిగిరాకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు బసన్న, కురుగోడు తాలూకా అధ్యక్షుడు లింగప్ప, బళ్లారి తాలూకా అధ్యక్షుడు ఈరన్న, కార్యదర్శి ధనురాజ్, జిల్లా కమిటీ సభ్యులు ఖాసీం సాబ్, మల్లప్ప,హొన్నూరప్ప, హడ్లిగిచెన్నప్ప, బసవరాజ్, లింగనగౌడ, గాదిలింగప్ప, వీరేశ్,హొన్నూర్, బైలూరు నాగరాజు, రమేశ్, ఉమామహేశ్వరప్ప, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏఐకేకేఎంఎస్ సభ్యులు

ఇంటి స్థలాల కోసం నగరసభ ముట్టడి



కార్యాలయాన్ని ముట్టడించిన నగర ప్రజలు

సిరుగుప్ప, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పేదలకు ఇంటి స్థలాలు పంపిణీ చేయాలని కర్ణాటక ప్రాంత రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగరసభ కార్యాలయాన్ని ముట్టడించారు. కర్ణాటక ప్రాంత రైతు సంఘం అధ్యక్షుడు అడివప్ప ఆధ్వర్యంలో వందలాది మంది నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ పేదలకు పట్టాలు పంపిణీ చేయడంతో నగరసభ నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుపేదలు ఇంట అద్దె కట్టలేక ముప్పుతిప్పలు పడుతున్నారని, 25 యేళ్ల నుంచి దరఖాస్తులు యేడాదికొకసారి చెల్లిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే జిల్లా అధికారి ఈ విషయంపై దృష్టి సారించి పేదలకు పట్టాలు అందజేయాలని అడివప్ప కోరారు.

ఆలయాల్లో దీపోత్సవం

కంప్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగిసిన తొలి రోజు పాడ్యమి సందర్భంగా సోమవారం కంప్లి తాలుకా పరిధిలోని పలు గ్రామాల్లో, క్యాంపుల్లో దీపోత్సవం చేపట్టారు.

తోరణగల్లు : కార్తీక మాసం చివరి ఆదివారం సందర్భంగా మార్కాండేయ స్వామి దేవస్థానంలో ఘనంగా పూజలు నిర్వహించారు. సండూరు తాలుకా కురేకుప్ప పట్టణంలోని మార్కండేయస్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

దంచికొట్టిన వర్షం



నగర శివారులో కురుస్తున్న వాన

బళ్లారి సిటీ. డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బళ్లారి, విజయనగరం జిల్లాలో పెంగల్ తుఫాన్ ప్రభావంతో పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. ఆకాశం రెండు మూడురోజుల నుంచి మేఘావృతమై ఉంది. పలు ప్రాంతాల్లో ప్రస్తుతం వరి పంట కోత దశకు చేరుకోగా, కొన్ని చోట్ల కోతలు ముగిశాయి. మరి కొన్ని చోట్ల వరి కోతలు కొనసాగుతున్నాయి. ఈ దవలో వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కోత కోసిన వరిని వరి పొలంలో వదిలేస్తే నష్టం వాటిల్లుతుందనే భయం నెలకొంది.

రైతులకు అందుబాటులో టార్పాలిన్లు

వరి,మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసిన రైతులు ఆరబోయడానికి ఆందోళన చెందవద్దని వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో టార్పాలిన్లు గిట్టుబాటు ధరకు అందజేస్తున్నామని అధికారులు తెలిపారు. విజయనగరం వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు శరణప్ప ముదుగల్ తెలిపిన వివరాల మేరకు జిల్లాలోని వివిధ వ్యవసాయ శాఖ కార్యాలయాల్లో 8,12 మీటర్ల విస్తీర్ణంలో 4,000 టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైతే మరిన్ని తెప్పించి రైతులకు పంపిణీ చేస్తామన్నారు. రైతులు ముందుగా సస్యరక్షణపై దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం ఎండలు లేవని కంగారుపడవద్దని, నీరు పడని చోట ధాన్యం పోసి టార్పాలిన్లను కప్పి గాలిలో ఆరబెట్టాలన్నారు.

గ్రామాల్లోనూ జోరు వానలు

బళ్లారిరూరల్: ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు నగరంలో చలిగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి.



వర్షంలో ప్రయాణిస్తున్న వాహనాలు

కార్మికుల భద్రతపై దృష్టి పెట్టాలి

● గనుల భద్రత సంచాలకుడు బిపుల్ బిహారి సతియార్



వేదికపై గనుల సంచాలకుడు బిపుల్ బిహారి సతియార్

బళ్లారి సిటీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గనుల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతపై దృష్టి పెట్టాలని గనుల భద్రత సంచాలకులు బిపుల్ బిహారి సతియార్ కోరారు. కర్ణాటక గనుల భద్రత సంస్థ గనుల భద్రత డైరెక్టర్, స్థానిక ఎమ్మెస్పీయల్ సంస్థలు కలిసి నిర్వహించిన గనుల భద్రత వారోత్సవాలు సోమవారం ముగిశాయి. ఈసందర్భంగా బిపుల్ బిహారి మాట్లాడుతూ గనుల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా భద్రత చర్యలు చేపట్టాలని గనుల సంస్థలకు కోరామన్నారు. శాస్త్రీయ పద్ధతిలో సాంకేతిక పరిజ్ఞానంతో మైనింగ్ చేస్తే ప్రమాదాలను నియంత్రించ వచ్చన్నారు. కార్మికుల ఆరోగ్యంపై యజమానులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కర్ణాటక రాష్ట్ర ఖనిజ కార్పొరేషన్ ఎండీ జయభావస్వామి, కర్ణాటక గనుల భద్రత సంస్థ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్, గనులు, భూవిజ్ఞాన శాఖ ఉపసంచాలకుడు నాగేంద్రకుమార్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రితాతను దర్శించుకున్న మాజీ మంత్రి



ఎర్రితాత సన్నిధిలో మాజీమంత్రి శ్రీరాములు

బళ్లారిరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో వెలిసిన చేళగుర్కి ఎర్రితాత ఆలయంలో ఆదివారం మాజీ మంత్రి శ్రీరాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ముత్యాలపల్లకి ఉత్సవంలో పాల్గొన్నారు. శ్రీరాములు అభిషేకం, పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు బాలనగౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ గ్రామ పంచాయతీ అధ్యక్షుడు హనుమంతు, బీజేపీ ప్రముఖులు యల్లప్ప, ఆలయ కమిటీ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకే మంత్రి పదవులు ఇవ్వాలి

● రైతు సంఘం రాష్ట్ర సంఘటన కార్యదర్శి సయ్యద్



మాట్లాడుతున్న సయ్యద్ అబిద్ బాషా ఖాద్రి

కంప్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బళ్లారి విజయనగర జిల్లాలకు ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఇతర జిల్లాల వారికి కాకుండా స్థానికులనే పదవి ఇవ్వాలని రైతు సంఘం రాష్ట్ర సంఘటన కార్యదర్శి సయ్యద్ అబిద్ బాషా ఖాద్రి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అతిథిగృహం ఆవరణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ యేడాది కేంద్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం తక్కువగా చెల్లించడం తగదన్నారు. ఈ విషయంపై రాష్ట్రస్థాయిలో నిరసనలు చేపడతామన్నారు. విజయనగర, బళ్లారి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రులు జమీర్ అహ్మద్ ఉన్నా లేనట్లేనని, స్థానికులకే పట్టం కట్టాలన్నారు. గణేశ్, గవియప్పకు కేటాయించాలన్నారు. కర్ణాటక రాష్ట్ర కిసాన్ జాగృతి సంఘం జిల్లా అధ్యక్షులు గంగాధర మాట్లాడుతూ కంప్లి తాలుకాలో రామసాగరం, ముద్దాపురం, దేవసముద్రం గ్రామాలలో ఎంతో మంది రేష్మపంటను పండిస్తున్నారు. ఈ శాఖ కూడ్లిగిలో వుండటంతో ఇక్కడి రేష్మ రైతులు ఇబ్బందులు పడుతున్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, తాలుకా అధ్యక్షుడు గువ్వాజీ రామాంజిని, యువఘటన అధ్యక్షుడు హర్షిత్, గౌరవాధ్యక్షులు హనుమంతు, గాదిలింగప్ప, మల్లిక్, సిద్దప్ప, శివప్ప, ఉష, దేవేంద్ర, విజయనగర జిల్లా అధ్యక్షురాలు రత్నమ్మ, సురేష్ పాల్గొన్నారు.

బస్సు ఢీకొని యువకుడి మృతి

రాయచూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సిరవార తాలూకా కవితాళ గ్రామం వద్ద సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళుతున్న యువకుడు దుర్మరణం పాలైయ్యారు. దేవతగల్ గ్రామానికి చెందిన రంగనాథ నాయక్(35) బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు కవితాళ పట్టణం ప్రధాన రోడ్డుపై ఢీకొట్టింది. దీంతో రంగనాథ్ నాయక్ అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కవితాళ పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

హోసూరు జోన్

జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షం



వర్షం కురిసిన ప్రాంతాలను వీక్షిస్తున్న కలెక్టర్, అధికారులు

హోసూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావం కృష్ణగిరి జిల్లాలో కొనసాగుతోంది. హోసూరు పరిధిలోని లోతట్టు ప్రాంతాలను కమిషనర్ శ్రీకాంత్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అజితతోపాటు మున్సిపల్ అధికారులు స్వయంగా పరిశీలించారు. హోసూరు రాంనగర్, కాలైకుంట, కేసీసీ నగర్, రాయకోట హడ్కో, తదితర ప్రాంతాలను సందర్శించారు. రాంనగర్ ప్రాంతంలో వర్షం నీరు నిల్వ ఉండడంతో మోటార్ల ద్వారా పంపింగ్ చేసి తొలగించారు. అలాగే హోసూరు నగరంల్లో 29 మి.మీ, కెలవరపల్లి ఆనకట్ట ప్రాంతంలో 30 మి.మీ వర్షం నమోదైంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్థమైంది.

టోల్‌ఫ్రీ నంబరు 1077 ఏర్పాటు

హోసూరు(కృష్ణగిరి): ఫెంగల్ తుఫాను కారణంగా ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కృష్ణగిరి జిల్లాలో ఊత్తంగరై బస్‌స్టేషన్ వెనుక ఉన్న పేరూరు సరస్సు, చిన్నప్పన చెరువు పూర్తి స్థాయికి చేరుకున్నాయి. వర్షపునీటి వల్ల తలెత్తే సమస్యలపై ప్రజలు టోల్ ఫ్రీ నెంబరు 1077కు ఫిర్యాదు చేయాలని కలెక్టరేట్ ప్రకటించింది. ఊత్తంగరై మున్సిపల్ పరిధిలో లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలో వర్షపునీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పునరుద్ధరణ చర్యలకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. కృష్ణగిరి కలెక్టర్ సరయు, ఇతర అధికారులు సోమవారం పలు ప్రాంతాలను సందర్శించారు. పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకొనగా ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. తిరుపత్తూరు రోడ్డు, చిన్నప్పన చెరువు పూర్తి స్థాయికి చెరుకున్నాయి. ఊత్తంగరై మున్సిపల్ కార్పొరేషన్ పరిధిల్లోని 4వ వార్డు అన్నానగర్‌లో ఇళ్లలోకి వర్షం నీరు చేరడంతో పునరావాస చర్యలు చేపట్టారు. తాత్కాలిక శిబిరాలు నిర్వహించగా 200మందికిపైగా ఆసరా కల్పించారు. పాంబారు డ్యాంలో 15 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నది ఒడ్డున ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు.

నేడు నారేయణతాత ఆశ్రమంలో సంబరాలు

● బ్రహ్మశ్రీ వెంకటేశ్వర స్వామి జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

హోసూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక సద్గురు నారేయణతాత ఆశ్రమ వ్యవస్థాపకులైన బ్రహ్మశ్రీ వెంకటేశ్వర స్వామి జన్మదిన వేడుకలు మంగళవారం జరగనున్నాయి. ప్రతియేటా ఆయన జన్మదినాన్ని భక్తులదినోత్సవంగా ఆచరిస్తున్నారు. వేడుకలకోసం ఏర్పాట్లను బ్రహ్మశ్రీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షిస్తున్నారు. మూజులుగా వర్షం కురుస్తుండడంతో ఎటువంటి లోటు లేకుండా వైభవంగా ఆయన జన్మదినాన్ని జరిపేందుకు సమిష్టిగా భక్తాదులు సహకరిస్తున్నారని శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ భక్తాదులకు ఏ మాత్రం అసౌకర్యం కల్గించకుండా కనీస వసతులు ఏర్పాటు చేయాలని స్వామిజీ సూచించారన్నారు. ఆ మేరకు ఆశ్రమంలోని దేవాలయంలో విశేష పూజలు, భక్తులచే భజనలు ఉంటాయన్నారు. భక్తులనుద్దేశించి స్వామి వారు ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందన్నారు. విచ్చేసే సాధువులను ఘనంగా సత్కరించదలిచామన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అన్నదాసోహం ఉంటుందన్నారు.



వెంకటేశ్వరస్వామితో శ్రీనివాసరెడ్డి

చంద్రచూడేశ్వర ఆలయంలో అన్నదానం

హోసూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పుట్టినరోజును పురస్కరించుకుని హోసూరులో ప్రముఖ చంద్రచూడేశ్వర స్వామి ఆలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మేయర్ సత్య పాల్గొని సహపంక్తి భోజన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ తమ నాయకుడికోసం అర్థవంతంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీఎంకే ముఖ్యులు సభ్యులు ఎల్లోరమణి, రీజనల్ సెక్రటరీ రాము, నిర్వాహకులు రాజా, కణ్ణన్, సుమన్, మహేశ్, క్రీడాభివృద్ధి ఆర్గనైజరు రామూర్తి తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న మేయర్ సత్య